# భీముడు ఓడిపోయాడు

మొలకలపల్లి కోటేశ్వరరావు

వయసులో నాకంటే భీముడు పదేళ్ళు చిన్నవాడైనా మా ఇద్దరి మధ్యా స్నేహానుబంధం వుంది. నేనంటే వాడికి అభిమానం. వాడంటే నాకు అంతకుమించిన అభిమానం.



వాడు మంచి శ్రమజీవి. గట్టి పనివాడు. మామూలు పనులు కాదు, అసాధారణమైన పనులు అవలీలగా చేస్తాడు.

మా ఇంటికి ఆరు ఇళ్ళ అవతలే వాళ్ళ ఇల్లు. అంతకుముందు ఒంటి నిట్టాడి తడికెల పూరిగుడిసె వుండేది. నిరుడు అది పీకిపారేసి, రెండు నిట్టాళ్ళు పెట్టి, గోడలు కట్టుకుని, పూరికప్పు అయినా గట్టికప్పు వేసుకున్నాడు.

''రేపు పందెం అన్నాయ్?'' అంటూ సాయంత్రం ఇంటికి వచ్చాడు.

''ఏం పందెం ఏందిరా?'' అడిగాను.

చెప్పాడు. వాడి పందెం మాట విని నోరెళ్ళబెట్టాను.

''లేనిపోని సాహసం చేస్తున్నావురా! ఏమైనా తేడా పడితే ఎంత పనవుతుంది? ఎందుకొచ్చిన పందెంరా?''

వాడు నవ్వి, కాసేపు వుండి వెళ్ళిపోయాడు. వాడి నవ్వులో జీవం వున్నట్లు నాకు అనిపించలేదు.

ఇప్పుడు వాడు పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయి వున్నాడు. ఎలా తీరుస్తాడో, ఏం చేస్తాడో? నేను అడ్డంవుండి కొన్నిచోట్ల అప్పు ఇప్పించాను. వాళ్ళు నన్ను అడుగుతున్నారు.

అప్పు విషయం వాడ్ని అడుగుదామనుకుంటూనే మానుకున్నాను. అడిగినా వాడు ఇప్పుడు ఎక్కడ తెచ్చి ఇవ్వగలడు?

మరుసటిరోజు పందేనికి అంతా సిద్ధమైంది.

జనం అంతా ఆడా మగా, చిన్నాపెద్దా

అందరూ వూరి నడిబొడ్డున వున్న కళామందిరం వద్దకు చేరుకున్నారు.

''ఓర్నీ బండబడ... నడుములు పోతయ్యిరా! అసలు అది అయ్యే పనేనంట్రా? చూస్తాచూస్తా రెండేలు రొక్కం ఎందుకు పోగొట్టుకుంటావురా? పందెం లేదూ పాడులేదూ.. తగ్గరా'' నా పక్కనే నిలబడిన గ్రామపెద్ద, రెండుసార్లు సర్పంచ్‌గా పని చేసిన నారాయణ అన్నాడు.

''ఊరుకో బావా... తగ్గేది ఏందే? మీసం వున్న మొగోడ్ని. సయ్యే దేనికైనా'' అన్నాడు భీముడు, మీసం తిప్పుతూ నారాయణతో.

''ఓరేయ్.. ఈడు మొద్దుగాడిదకొడుకురా! ఇరం పరం తెలవదు. ఒకరు చెబితే యినుకునే రకం కాదు. నడుములు పోతే బతికినంతకాలం ఏడ వాల. ఇప్పుడు కుర్రమూర్ఖం. తరవాత మీ జీవానికి పడి ఏడుస్తాడు. మీరైనా మానుకోండ్రా!'' భీము డితో ఎదురుపందెం పెట్టుకున్నవాళ్ళతో అన్నాడు.

''నువ్వూరుకో.. ఎందుకు మాట్టాడతావు? నీ మాట ఇక్కడ ఎవురు యింటారు?'' నారాయణకి దగ్గరలోనే నిలబడ్డ ఆయన మేనల్లుడు కసిరాడు.

నారాయణ ''వద్దు.. వద్దు'' అని అంటూనే వున్నా ఆయన మాటల్ని ఎవరూ చెవిలోనికి దూర నివ్వలేదు.

కొందరు కుర్రవాళ్ళు రిక్షామీద ఇసుకని రైసు మిల్లు దగరికి తీసుకుపోయి అక్కడ వున్న ధర్మకా టాలో, 110 కేజీల ఇసుకని కాటా వేయించుకుని ఆ గోతం తీసుకువచ్చారు. గోతం కిందపడి పగిలిపో కుండా నలుగురు కుర్రవాళ్ళు రిక్షానించి కిందికి దించారు.

110 కేజీల ఆ ఇసుక గోతాన్ని మరొకరి సహాయం లేకుండా ఒక్కడే భుజం మీదికి ఎత్తుకో వాలి. ఒక్కసారి కాదు, ఐదుసార్లు నేలమీద నుంచి భుజం మీదికి ఎత్తుకోవాలి. అదీ పందెం!

భీముడు గెలిస్తే ఐదు వేలు వస్తాయి. ఓడిపోతే తను రెండువేలు ఇవ్వాలి.

ఊరి జనం అంతా సెంటర్‌కాడికి చేరుకున్నారు.

ఒకర్ని ఒకరు నెట్టుకుంటూ అందరూ ఆసక్తిగా, ఉత్సాహంగా, ఉత్సుకతతో చూస్తున్నారు.

''కూసోండ్రా... ఏహె కూసోండి'' ముందు నిల బడి వున్నవాళ్ళని కూర్చోబెట్టడానికి కొంతమంది ప్రయత్నిస్తున్నారు.

భీముడు పంచె గోచీ బిగించి పందేనికి సన్నద్ధ మయ్యాడు.

మోకాళ్ళ మీద వంగి ఉడుం పట్టుతో చిన్నగా లేపుతూ భుజంమీదకి ఎత్తుకున్నాడు.

జనం చప్పట్లు.

తొలిసారి... రెండోసారి... మూడోసారి...

మనిషి అలిసిపోయాడు. రొప్పు వచ్చింది.

అక్కడే వున్న భీముడి తమ్ముడు కొబ్బరి బోండం పగలగొట్టి ఇచ్చాడు.

''ఇక చాల్లేరా... ఒక్కసారి లేపినా అదే, పది సార్లు లేపినా అదే కదరా...'' అని కొందరు కేకలు పెడుతున్నారు.

ఇరవై నిముషాల వ్యవధిలోనే ఐదుసార్లు ఎత్తు కోవాలి.

నాలుగోసారి కష్టంమీద అతి ప్రయాసపడుతూ ఎత్తుకున్నాడు.

అంతే. చతికిలబడిపోయాడు.

''అయిపోయిందిరా వాడి పని. వాడు మని షిరా, మిషన్ కాదు. ఈసారి ఇక లేపలేడు. కాస్తా కూస్తానా... నూట పది కేజీలంటే మాటలా?'' అంటున్నారు కొందరు.

మబ్బులు లేచి వాతావరణం చల్లగా ఉంది. వానగాలులు వీస్తున్నాయి.

అంత చల్లదనంలోనూ భీముడి శరీరం నుంచి చెమటలు కాలువలుగడుతున్నాయి.

భీముడి ముఖకవళికలు చూసి నాకూ సందేహం కలిగింది. ఈసారి ఎత్తుకోగలడో లేదో అని.

నాలుగు నిముషాలు కూర్చుని లేచాడు భీముడు.

మనసులోనికి రెండో ఆలోచన రానివ్వకుండా లేచీ లేవడంతోనే ఒక్క ఉదుటున, ఒక్క ఊపున పట్టుకుని లేపి భుజానికి ఎత్తుకున్నాడు.

జనం చప్పట్లు మారుమోగిపోయాయి. ఈలల హోరు. కేకలు.

కొంతమంది ఉత్సాహంగా వంద రూపా యలూ, యాభై రూపాయల నోట్లు భీముడు ధరిం చిన బనియన్‌కి ఆనందంగా గుచ్చుతున్నారు. కొందరు భీముడ్ని భుజాల మీదకి ఎత్తుకున్నారు.

''మొనగాడివిరా నువ్వు. నీలాంటి మొనగాడు ఎక్కడా వుండ్రా!'' అన్నాడు నారాయణ సంతో షంతో. ఆయన కళ్ళు చెమ్మగిల్లాయి.

''ఓర్నాయినో.. కింటాలుకంటే ఎక్కువ బరువు. మోయడం కాదు, ఎత్తుకోవడం! మామూలు గట్టో డివి కాదురా నువ్వు. మహా మహా గట్టోడివి!'' జనం నుంచి ఒకతను పరుగెత్తుకు వచ్చి అన్నాడు.

''ఇలాంటోడికి ట్రైనింగ్ ఇచ్చి ఒలంపిక్స్‌కి తీసు కుపోతే బోలెడు బహుమతులు గెలుచుకుని వస్తాడు. ఇలాంటి వాళ్ళని పట్టించుకునేది ఎవరు? రికమెంట్ ఉన్నవాళ్ళకే అక్కడ చోటు! మనవాళ్ళు అట్టహాసంగా ఒలంపిక్స్‌కి పోవడం, ఉత్త చేతులు వూపుకుంటూ రావడం! ఇంత పెద్ద దేశం, ఇంత జనాభా వున్న దేశం నాలుగంటే నాలుగు పతకాలు ఎప్పుడైనా గెలుచుకుని వచ్చిందీ? ఇలాంటి వాడిని సానబడితే.. వజ్రమే కదూ!'' డిగ్రీ చదివి, ఉద్యోగం లేక రోజూ పేపర్ చదివే ఒకతను అన్నాడు.

***

భీముడు అసలుపేరు అయ్యన్న. చిన్నప్ప ట్నించీ వూళ్ళో జనమంతా నవ్వులాటగా భీముడు అని పిలుస్తుండటంతో చివరికి అదే పేరు వాడుకప డిపోయింది.

నిజానికి భీముడు మనిషి కూడా పురాణాల్లోని భీముడిలానే వుంటాడు..

ఇద్దరు మనుషులపెట్టు లావుగా, దిట్టంగా వుంటాడు. ముగ్గురు మనుషుల పెట్టు తిండి తింటాడు. నలుగురు మనుషులపెట్టు పనిచేస్తాడు.

అతను పనిలో వంగాడంటే ఎంత పనైనా పిండి కావల్సిందే. చూసేవాళ్ళే ఆశ్చర్యపోవాలి. చిన్న ప్పుడు అతనికి అన్నం పెట్టలేక వాళ్ళ అమ్మ దిగు లుపడేది.

అతను పనిలో వంగాడంటే ఎంత పనైనా పిండికావల్సిందే. చూసేవాళ్ళే ఆశ్చర్యపోవాలి. చిన్నప్పుడు అతనికి అన్నం పెట్ట లేక వాళ్ళ అమ్మ దిగులుపడేది. ఆమె తిండిపెట్టలేక వీడిని తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టేది. పాపం వీడి కడుపేమో పెద్దది! ''ఒరేయ్.. నీకు తిండిపెట్టడం నావల్ల కాదురా. దెయ్యపు తిండి తింటంటివీ! ఎవురో ఒక ఆసామి కాడ జీతానికి వుండు. జీతం నాతం లేకపోతే పోయిందిలే! ముప్పూటలా కడుపునిండా బువ్వ అయినా పెడతారు. నువ్వు తినే తిండి నేనెక్కడ పెట్టేదీ?'' అన్నది అమ్మ.

గంపెడు సంతానం.

వాళ్ళ అయ్య రెక్కల కష్టం మీదనే కుటుంబం అంతా బతకాలి. ఆ వెనుకటి రోజుల్లో పనులు కూడా పెద్దగా వుండేవి కాదు. జరుగుబాటు అంతంతమాత్రం.

దాంతో ఆమె తిండిపెట్టలేక వీడిని తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టేది. పాపం వీడి కడుపేమో పెద్దది!

భీముడికి పదేళ్ళ వయసు వచ్చింది.

''ఒరేయ్.. నీకు తిండిపెట్టడం నావల్ల కాదురా. దెయ్యపు తిండి తింటంటివీ! ఎవురో ఒక ఆసామి కాడ జీతానికి వుండు. జీతం నాతం లేకపోతే పోయిందిలే! ముప్పూటలా కడుపునిండా బువ్వ అయినా పెడతారు. నువ్వు తినే తిండి నేనెక్కడ పెట్టేదీ?'' అన్నది అమ్మ.


అయ్య తీసుకుపోయి ఒక ఆసామి ఇంటివద్ద జీతానికి వదిలివచ్చాడు.

పొట్టకూడే జీతం!

భీముడు జీతానికి వున్న కాపుకి ఐదారు బరి గొడ్లు వుండేవి. ఇతర బుడ్డజీతగాళ్ళతోపాటు వీడు కూడా గొడ్లని వాగుల్లోనికీ, వంకల్లోనికీ, చెలకల్లో నికీ తీసుకుపోయి మేపుకువచ్చేవాడు.

చిన్నప్పట్నించీ కూడా భీముడికి పందెం అంటే చాలా ఉత్సాహం. గొడ్ల దగ్గర బుడ్డ జీతగాళ్ళతో రోజూ ఏదో పందెం పెట్టుకునేవాడు.

''మీరంతా ఒకపక్క వుండండ్రా! నేనొక్కడ్నే ఒకపక్క. పయిటింగ్''




బుడ్డ జీతగాళ్ళు అందరూ ఒకవైపు వుండే అందర్నీ చితక్కొట్టి వదిలిపెట్టేవాడు.

బలిగుడ్డు ఆట అయితే చెప్పాల్సిన పనిలేదు. భీముడు ఎటువైపు వుంటే గెలుపు అటే! కూతకి వెళ్తే పదిమంది పిల్లలు పట్టుకున్నా వాళ్ళని ఈడ్చుకుని వస్తాడు.

వయసు పెరిగేకొద్దీ రకరకాల పందేల్లో పోటీపడేవాడు. కొంతమంది పోకిరీ మనుషులు రెచ్చగొడితే నిజంగానే రెచ్చిపోయి పందేనికి సిద్ధమయ్యేవాడు.

మొన్ననే ఇడ్లీల పోటీ జరిగింది. వంద ఇడ్లీలు గంటన్నర వ్యవధిలో తినాలి. తిన్నాడు. నెగ్గాడు.

తినే పోటీలు లెక్కకాదు. పని పోటీల్లో పాల్గొనేవాడు. రకరకాల పనుల పోటీలు.

ఒకసారి పంట నూర్పిడి పోటీ పెట్టుకున్నాడు.

ఒకసారి ఎకరంలో వరిపంటని ఒక్కడే నూర్చుకుని, తూర్పారపట్టుకుని, గోతాలకి ఎత్తుకుని, ట్రాక్టర్ ట్రక్‌లో వేసుకుని, ఇంటికి తెచ్చి మెట్టువేశాడు. ఒక్కడే! రెండో మనిషి సాయం లేదు. ట్రాక్టర్ డ్రైవర్ ట్రాక్టర్ తోలకం వరకే పని. ఊరంతా ఆశ్చర్యంలో మునిగిపోయింది.

మరోసారి యాభై కిలోల డిఎపీ గోతాన్ని నెత్తికి ఎత్తుకుని, ఎక్కడా దింపకుండా, భుజానికి నెత్తికీ మార్చుకుంటూ తొమ్మిది కిలోమీటర్ల దూరం తీసుకుపోయి, తీసుకువచ్చాడు.

టైరు బండి మీద పద్నాలుగు మందిని ఎక్కించుకుని, ఎద్దులు లేకుండా కాడి భుజానికి ఎత్తుకుని ఊరు నాలుగు వీధులూ రెండుసార్లు తిప్పాడు.

ఇలాంటి పోటీలు ఎన్నో!

అసాధారణమూ, అద్వితీయమూ, అనితరసాధ్యమైన పనులతోనూ, పోటీలతోనూ భీముడి పేరు జిల్లా మొత్తం వ్యాపించిపోయింది.

దినపత్రికల జిల్లా అనుబంధాలు రంగుల ఫోటోలు వేసి భీముడ్ని గురించి చాలా గొప్పగా కీర్తిస్తూ, వర్ణిస్తూ రాసాయి.

పందేలు పెట్టుకోవడంలో ఎంత ఆసక్తో అందులో గెలవడంలో కూడా అంతే ఆసక్తి, అంతే ఉత్సాహం. అంతే పట్టుదల. వెన్ను చూపడం అంటే ఏమిటో తెలియదు. దాదాపు ఏ పందెం లోనూ ఓటమి ఎరుగడు.

నాకు తెలిసి భీముడులాంటి బలశాలి, శక్తిసంపన్నుడూ, పనిమంతుడూ, ఘటికుడూ మరొకరు లేరు. అరుదుగా మినహా బహుశా ఎక్కడా వుండక పోవచ్చు కూడా.

భీముడి శక్తిసామర్థ్యాలు సమర్థంగా, సక్రమమైన రీతిలో వినియోగం కాలేదు. వ్యక్తిగతంగా అతనికి ఎలాంటి మేలూ కలగలేదు.

అతని పోటీల్ని గురించి పత్రికలు చాలా రాసినా ప్రయోజనం లేకపోయింది. ఏ ప్రభుత్వ సంస్థనుంచి కానీ, ఏ ప్రభుత్వేతర సంస్థనుంచి కానీ అతనికి ఎలాంటి వూతం, ప్రోత్సాహం, ప్రోద్బలం లేభించలేదు. భీముడు చేసే చాకిరీకి, అలవిమాలిన పనికీ జీతానికి ఉంచుకుంటే బాగుండని వూళ్ళో చాలామంది రైతులకి కోరిక. అయితే ఆడవాళ్ళు పడనిచ్చేవాళ్ళు కాదు.

''మేమెక్కడ వాడికి కుండలు కుండలు వండి వార్చేది? వాడు ఎంత చాకిరీ చేస్తాడో వాడికి వండి పెట్టడానికి మేం అంత చాకిరీ చేయాలి. మా వల్ల కాదు'' అనేవాళ్ళు.

భీముడు ఇద్దరు ఆసాముల ఇళ్ళలోనే జీతగాడిగా జీవితం గడిపాడు.

పంథొమ్మిదో ఏటనే భీముడికి వాళ్ళ అయ్య పెళ్ళిచేశాడు.

భార్య కూడా చిన్నవయసే. పని చేతకాదు. పెళ్ళయినా భీముడు జీతానికి ఉన్నాడు. అయితే ఆ జీతం ఎక్కువకాలం సాగలేదు.

అంతకుముందు ఒకటీఅరా వున్న ట్రాక్టర్లు ఇబ్బడిముబ్బడిగా పెరిగాయి. రైతులు అందరూ ఎద్దులూ, వ్యవసాయం ఎత్తేశారు. కాడీమేడీ ముల్లుగర్రా మూలన పడేశారు. గొర్రూగుంటకాగుంట దూలం ఎక్కించారు.

భీముడు జీతానికి ఉన్న ఆసామి కూడా జీతం లెక్కచూసి, డబ్బు ఇచ్చి భీముడ్ని ఇంటికి సాగనంపాడు. వాడికి మాత్రం ఇంకా జీతం చేయాలని కోరిక.

ఆసాముల ఇళ్ళలో తిండి అమరుతుంది కానీ ఇంటి దగ్గర వుంటే సరిగా తిండి వుండదని వాడి భయం.

భీముడి భార్య వయసుకి చిన్నది అయినా గయ్యాళి. పని చేతకాదు. భీముడి తిండి చూసి జడుసుకునేది. నసగా గొణుగుతూ వుండేది.

ఒంటి రెక్కలు తప్ప ఒక్క సెంటు భూమి లేదు. జీతానికి ఉంచుకునే వాళ్ళు ఎవరూ లేకపోవడంతో ఇంటి దగ్గరే వుంటున్న భీముడు ముఠాపనికి వెళ్ళడం మొదలుపెట్టాడు.

ఊళ్ళో పండే శనగలు, మినుములు, కందులు, పత్తి, పొగాకు, మిరపకాయలు – ఇలాంటి పంటల్ని తూకం వేసి లారీలకి ఎత్తే పని. క్వింటాల్ గోతాన్ని భీముడు అవలీలగా లారీలోకి విసిరివేసేవాడు.

ముఠా పని తక్కువగా వుండేది. ఆ వచ్చే డబ్బులతో కుటుంబం జరుగుబాటు కష్టంగా వుండేది.

మా ఇంటికి తరచుగా వచ్చేవాడు.

''ముఠా పనికి పోతన్నాగానీ డబ్బు పెద్దగా పడటం లేదన్నాయ్! నాకు వచ్చే డబ్బు ఉప్పుకీ పప్పుకీ చాలడం లేదు. ఈ బాధపడేకంటే పొలం కౌలుకి తీసుకుని వేసుకుంటే బాగుండు అనిపిస్తంది'' అన్నాడు.

''అట్నే చేయరా! కూలి చేసుకుంటే కుండమాడిద్ది కడుపు నిండిద్దేమో కానీ డబ్బులు ఏం ఎనకబడతయ్యిరా? కూలి మీద కుబేరుడు అయినోడు ఎవుడు వున్నాడు? పొలం పండాల, డబ్బు రావాల. పొలం వేసుకోవడమే మంచిదిరా'' అని నేను వాడ్ని సమర్థించాను.

''నువ్వే ఎక్కడైనా పొలం మాట్లాడి ఇప్పించన్నా. జీతం చేస్తా మిగుల్చుకున్న డబ్బు నా దగ్గర 80, 90 వేలు వున్నయ్యి. మంచి పొలం చూసి మాట్లాడు.''

చివరికి నా నెత్తిన బరువు పెట్టాడు. ''సరే'' అన్నాను.

మా చేలకి దగ్గరగానే, వాడికి నాలుగు ఎకరాల పొలం కౌలుకి మాట్లాడి ఇప్పించాను.

వాడు కౌలు రైతుగా పొలంలో దిగాడు.

నష్టాల పరంపర మొదలైంది. ఒక ఏడుకాదు, ఒక సాలు కాదు – వరుసగా నాలుగేళ్ళు నష్టాలే! దెబ్బమీద దెబ్బ! సమ్మెట దెబ్బ! ఈ నాలుగేళ్ళుగా ఏ ఏటికాఏడు కనీసం ఈ ఏడాది అయినా చూద్దాం చూద్దాం అనే ఆశతో పైరు వేయడం – ఏదో ఒక దెబ్బ తగలడం!

ఒక ఏడు వానల్లేవు. కరువు. రెండో ఏడు పంటకి ధరలేదు. మూడో ఏడు పురుగూ, తెగుళ్ళూ. ఖర్చులు అధికమయ్యాయి. నాలుగో ఏడు వానలు ముక్కుటం!

భీముడు అదునులో పైరు వేస్తాడు. పొలంలో చాకిరీ చేస్తాడు. స్వేదం చిందిస్తాడు. కానీ, వాన కురిపించలేడు గదా! అది ప్రకృతి ఇష్టం.

బాగా కష్టపడి పంట పండించగలడు. ధాన్యపు రాశులు సృష్టించగలడు. కానీ, వాటికి ధర తీసుకు రాలేడు కదా! అది వ్యాపారుల ఇష్టం, వాళ్ళ దయా దాక్షిణ్యం!

సరే, అన్నీ అనుకూలించినా ఎరువులు, పురుగు మందుల ధరలు తగ్గించలేడు. అది వ్యాపారుల కొమ్ముకాసే ప్రభుత్వ ఇష్టం!

ఇవ్వాళ రైతు మీద ముగ్గురు పగబట్టి వున్నారు. ప్రకృతి, ప్రభుత్వం, వ్యాపారులు!

ఈ మూడు సర్పాల్లో ఒక సర్పం బారినుంచి తప్పించుకుని బయటపడినా మరో సర్పం కాటు వేయడానికి కాచుకుని సిద్ధంగా వుంటుంది. రెండో సర్పంనుంచి తప్పించుకున్నా అక్కడ మూడో సర్పం సిద్ధం!

రక్తపింజెర లాంటి ఈ సర్పాలు రైతుని పీల్చి పిప్పిచేస్తున్నాయి.

ఈ నాలుగేళ్ళుగా భీముడు చితికిపోయాడు. జీతానికి ఉండి మిగుల్చుకున్న డబ్బులు తుడిచిపెట్టుకుపోయాయి. అప్పులు చెప్పాల్సిన పనిలేదు. వాటిలో బాగా కూరుకుపోయాడు.

నేను అడ్డం వుండి చాలా అప్పు ఇప్పించాను. వాడికి వున్న అప్పుల్లో ఎక్కువభాగం నేను ఇప్పించిందే! ఇప్పుడు నా పీకలమీదకి వచ్చి కూర్చుంది.

భీముడు మనిషి భీకరాకారంతో మహావృక్షంలా వున్నా మనసు మెత్తనైనది. బాగా భయస్తుడు. పనికి ఉక్కుమనిషే కానీ మనసు వెన్నకన్నా సున్నితం!

రోజురోజూ, పొద్దుపొడిచినా, పొద్దుగూకినా అప్పు నివురుగప్పిన నిప్పులా పెరిగేది కానీ తరిగేది కాదు.

ఈ అప్పులు ఎలా తీర్చాలా అని వాడు మానసికంగా కూడా చాలా కృంగిపోయాడు.

***

పందెం గెల్చిన వెంటనే కుర్రవాళ్ళు ఐదువేల రూపాయలు కవర్‌లో పెట్టి భీముడి చేతికి ఇచ్చారు. స్నేహితులు, కులపోళ్ళు అందరూ వెంటరాగా ఇంటికి వచ్చాడు భీముడు.

ఇంటి దగ్గర...

పెళ్ళికి వచ్చిన పెద్దల్లా అప్పులవాళ్ళు ఆసీనులై వున్నారు.

ఇప్పుడు వాడికి వచ్చిన ఈ ఐదువేలూ తీసుకుని ఒక అప్పువాడికైనా జమ ఇద్దామని నేనూ వెళ్ళాను. నాకంటే ముందే వాళ్ళు అక్కడ తిష్ట వేశారు.

''ఏరా భీమాయ్... ఎంత గొప్పపని చేశావురా! ఇరవై నిముషాల్లో ఐదువేలు సంపాయిచ్చావు. సరే గనీ, నా బాకీ ఎవారం ఏం చేసా? ఏందో తేల్చు!''

''అసలు నాది పెద్ద ఎమౌంట్. ఆరోజు వచ్చి కాళ్ళావేళ్ళా పడితే కాదనలేక ఇచ్చా. వడ్డీ పెరిగిపోతంది. ఐదు రూపాయల వడ్డీ అంటే మాటలా? ఈ ఐదువేలూ నాకివ్వు. బాకీలో జమవేస్తా!''

''మూడు నెలల్లో ఇస్తానని మూడేళ్ళనాడు తీసుకున్నావు. అతీగతీ లేదు. ఇంత గతిమాలినవాడివి అనుకోలేదు. కొద్దిగా అయినా మంచీమర్యాద వుంటే నా బాకీ ఎప్పుడో ఇచ్చి వుండేవాడివి!''

''ముందు ఆ ఐదేలూ ఇటియ్యి. లేనప్పుడు ఆగాను కదా, ఉండప్పుడు ఇయ్యడానికేం?''

బాకీల వాళ్ళు రకరకాలుగా మాట్లాడుతున్నారు. కొందరసలు సూటీపోటీ మాటలతో బూతులు తిడుతున్నారు.

''నువ్వు ఆ డబ్బు ఇస్తేనే నేను కదిలేది. నువ్వు డబ్బు ఇయ్యకపోతే నీ ఇంటిముందే మందు తాగి చస్తా. వూరక కాదు, నా చావుకి నువ్వే కారణమని కాగితం రాసిపెట్టి మరీ చస్తా! చచ్చిపోయినా నిన్ను వదల్ను. నా బిడ్డల వుసురుకూడా తగిలిద్ది. ఆలోచించుకో!'' బెదిరించాడు ఒకతను.

ఎవరికి వాళ్ళే ఆ ఐదువేలూ తీసుకోవాలని ఈగలు ముసిరినట్టు వాడిచుట్టూ ముసిరి వూపిరి ఆడనివ్వలేదు.

''మంచినీళ్ళు తాగి వచ్చి కడతా'' అంటూ వాడు లోపలకి వెళ్ళాడు.

మంచినీళ్ళ వంకతో లోపలికి అయితే వచ్చాడు కానీ, బయటికి వెళ్ళడానికి సంకోచించాడు.

వాళ్ళందరికీ ఏమని జవాబు చెప్పుకోవాలో అర్థం కాలేదు.

అతని దృష్టి ఎదురుగా మూలన వున్న పురుగు మందు డబ్బా మీద పడింది.

అది తీసుకుని గటగటా మంచినీళ్లు తాగినట్టు తాగాడు. తాగిన వెంటనే బయటికి వచ్చి పడిపోయాడు.

ఆ ప్రాంతం మందు వాసనతో నిండిపోయింది.

''అరెరె... మందు తాగాడ్రా'' అంటూ వాడ్ని మంచంమీద పడుకోబెట్టి ఆ మంచాన్ని నలుగురం ఎత్తుకుని దగ్గరలోనే వున్న ఆస్పత్రికి తీసుకుపోయాం.

సమయానికి డాక్టర్ వున్నాడు. వెంటనే మందు కక్కించే పనిలో పడ్డాడు.

ఏ పోటీలోనూ ఓటమి ఎరుగని ధీరుడు వాడు.

జీవితం అనే పోటీలో ఓటమి అంచులదాకా వెళ్ళి వెనక్కి మరలాడు.

వ్యవసాయం అనే మరో పోటీలో దారుణంగా ఓడిపోయాడు.

